www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 11 సెప్టెంబర్ 2023

5

తూర్పుగోదావరి



11న యథావిధిగా స్పందన : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి స్పందన కార్యక్రమం సెప్టెంబర్ 11 సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. కె. మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అందరూ జిల్లా స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని అన్నారు. అదేవిధంగా డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మునిసిపల్ స్థాయిలో కమిషనర్లు, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ప్రజలు నుంచి సంబంధిత సిబ్బంది ప్రజల నుంచి స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ వారం జగనన్న కు చెబుదాం కార్యక్రమాన్ని సెప్టెంబర్ 13న కొవ్వూరులో, సెప్టెంబర్ 16న నిడదవోలులో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రాజమహేంద్రవరంలో హై అలర్ట్

- చంద్రబాబు సెంట్రల్ జైలుకు రాకతో ఉద్రిక్తత
- అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా బందోబస్తు
- నగరంలో 36 పోలీసు పికెట్లు ఏర్పాటు
- కొనసాగుతున్న టిడిపి నేతల గృహా నిర్బంధాలు
- జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలుకు ఆదేశాలు
- బంద్‌ను జయంప్రదం చేయాలని టిడిపి నేతలు పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎసిబి కోర్టు ఈ నెల 22వ తేదీ వరకూ రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరంలో హై టెన్షన్ నెలకుంది. విజయవాడ ఎసిబి కోర్టు నుంచి ఆయనను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించే క్రమంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి రాజమహేం ద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తారనే సమాచారాన్ని అందుకున్న తూర్పు గోదావరి జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. సెంట్రల్ జైలు వద్ద సుమారు 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం నగరానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి టిడిపి నేతలు, శ్రేణులు రాకుండా ఎక్కడకక్కడ పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. నగరంలోకి ప్రవేశించే అన్ని ప్రధాన రహదారులతోపాటు, ముఖ్య కూడళ్లలో పోలీసు పికెట్లును ఏర్పాటు చేశారు. నగర చుట్టు ప్రక్కల ప్రాంతాలతో కలిపి ఏకంగా 36 పోలీసు పికెట్లను ఏర్పాటు చేసినట్లు పోలీసువర్గాలు వెల్లడించాయి. చంద్రబాబును సెంట్రల్ జైలుకు తీసుకొస్తున్న నేపథ్యంలో నగరంలో అటు వై జంక్షన్ నుంచి ఇటు లాలాచెరువు జంక్షన్ వరకూ ఉన్న ప్రధాన రహదారిని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ రోడ్డులో పూర్తిగా రాకపోకలను నిలుపుదల చేశారు. చంద్రబాబు సెంట్రల్ జైలుకు వచ్చే సమయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అడ్డుకునే అవకాశం ఉందన్న అంచనాతో పోలీసులు మరింతగా అప్రమత్తం అయ్యారు. గత రెండు రోజులుగా గృహ నిర్బంధంలో ఉన్న నేతల గృహాల వద్ద పోలీసు బందోబస్తును మరింతగా పెంపుదల చేశారు. ఇదిలావుండగా చంద్రబాబుకు న్యాయస్థానం రిమాండ్ విధించిన నేపథ్యంలో టిడిపి శ్రేణులు రోడ్డపైకి వచ్చి ఆందోళనకు దిగే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి పి.జగదీష్ ప్రకటించారు. ఈ నెల 30వ తేదీ వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా ఎవ్వరూ ప్రయత్నించరాదని, 144 సెక్షన్‌ను అతిక్రమిస్తే ఖఠినమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



సెంట్రల్ జైలు వద్ద బ్యారికేడ్లతో భారీ బందోబస్తు

స్నేహ బ్లాక్‌లో వసతి

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో స్నేహ బ్లాక్‌లో వసతి ఏర్పాట్లు చేసినట్లు జైలు వర్గాలు వెల్లడించాయి. చంద్రబాబు న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు ఇంటి భోజనం, మందులు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎన్‌ఎస్‌జి కమాండోల రక్షణలో ఉండే చంద్రబాబుకు సెంట్రల్‌జైల్లో జైలు అధికారులతో ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశారు. చంద్రబాబుపై అక్రమంగా కేసు నమోదు రిమాండ్‌కు తరలించడాన్ని నిరసిస్తూ సోమవారం జరుగుతున్న రాష్ట్ర బంద్‌లో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బంద్‌ను జయప్రదం చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పిలుపునిచ్చారు. అలాగే సోమవారం జరిగే రాష్ట్ర బంద్‌కు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మద్దతు ప్రకటించడంతో టిడిపి, జనసేన శ్రేణులు సంయుక్తంగా బంద్‌లో పాల్గొనే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

హామీల అమలులో మోడీ విఫలం

-సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వర రావు


ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలతోపాటు, ఇతర హామీలను అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం విఫలం అయ్యిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరావు ధ్వజ మెత్తారు. ధవళేశ్వరంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం సిపిఎం తూర్పు గోదావరి జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా కమిటీ సభ్యులు జువ్వ ల.రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమా వేశంలో ఉమామహేశ్వరావు మాట్లాడుతూ మోడీ ఇచ్చిన ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటిని నెరవేర్చిన పరిస్థితి లేదని అన్నారు. తొమ్మిదేళ్ల మోడీ పాలనలో దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిందని పేర్కొన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని పూర్తిగా తుంగలో తొక్కారని విమర్శించారు. మానవవనరులను దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడంలో విఫలం అయ్యారని అన్నారు. మరో ప్రక్క ప్రభుత్వ రంగం సంస్థలు, పరిశ్రమలు నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టుతున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటీపరం చేయడం వల్ల ఉన్న ఉద్యోగాలు కోల్పోవడంతోపాటు, ఖాళీ అయిన పోస్టు లను భర్తీ చేయకుండా కేంద్రప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. విదేశాల్లో ఉన్న నల్లధనం వెలికితీసి ప్రతీ బ్యాంకు అకౌంట్‌దారుని ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పిన మోడీ ఆచరణలో కార్పొరేట్ కంపెనీల బకాయిలు రద్దు, పన్నుల మినహా యింపులు ఇస్తూ ప్రజాధనాన్ని వారికి దోచిపెడు తున్నారని దుయ్యబట్టారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంపుదల చేసే చర్యలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం మత ప్రాతిపదికన దేశాన్ని విభజించి విద్వేశాలతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజ మెత్తారు. కేంద్ర ప్రభుత్వ పాలనాతీరును ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు సిపిఎం కృషి చేస్తుందని, తద్వారా కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేస్తుందని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ సిపిఎం చేపట్టే ప్రజా ఉద్యమాలకు ప్రజలు మద్దతుగా నిలిచి జయప్రదం కావాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాజమహేంద్రవరం నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా నాయ కులు బి.రాజులోవ, ఎస్.ఎస్.మూర్తి, టిఎస్. ప్రకాష్, సావిత్రి, కర్రి.రామకష్ణ, రాధా కష్ణ, ప్రసన్న కుమార్, భగత్, దానియల్, రాజా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన గృహ నిర్భంధాలు.. దీక్షలు..

చంద్రబాబు నాయుడును సిఐడి పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా టిడిపి నేతలను, ముఖ్య నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. మరికొందరిని హౌస్ అరెస్టులు చేశారు. పోలీస్ స్టేషన్లకు తరలించిన కొందరు నేతలను శనివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయగా, మరికొందరు ముఖ్య నేతలను ప్రైవేటు గృహాలకు తరలించారు. టిడిపి రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపు ఇవ్వడంతో ముఖ్య నాయకులను ఆదివారం సైతం వారి వారి గృహాల్లోనే నిర్బంధించారు. **రాజమహేంద్రవరం** తిలక్ రోడ్డులో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు నిరసన దీక్షకు దిగారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు నాయుడుని వెంటనే విడుదల చేయాలని, జగన్ నిరంకుశ పాలన నశించాలని నినాదాలు చేశారు. అర్బన్ నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి భవానికి ఆదివారం 149 నోటీసును జారీ చేశారు. బయటకు వెళ్లరాదని, ఎటువంటి ఆందోళనలకు దిగవద్దని పోలీసులు కోరారు. **గోకవరం** కామరాజుపేటలో టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు అడపా భరత్ బాబు ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. **సీతానగరం** మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. శాంతి భద్రతలు దష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా మండల వ్యాప్తంగా టిడిపి నాయకులను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన టిడిపి నాయకులను ఉదయం నుండి రాత్రి వరకూ కోర్టు తీర్పు వెల్లడించేవరకూ సీతానగరం పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. **ఉండ్రాజవరం** వేలివెన్నులో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఇంటి వద్ద సామూహిక నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సింహాద్రి రామకష్ణ, పలువురు మహిళలు పాల్గొన్నారు. **చాగల్లు** చంద్రబాబు నాయుడుకు కోర్టు రిమాండ్ విధించడంతో మండలంలో 144 సెక్షన్ అమలుల్లోకి తీసుకొచ్చారు. చాగల్లు మెయిన్ సెంటర్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మండలానికో రూ.60 లక్షలు


కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో ప్రతీ మండలానికి రూ.60 లక్షలను విడుదల చేసినట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆయా నిధులతో గ్రామాల్లో అంతర్గత రహదారులు, అనుసంధాన రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వినియోగించాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా రూ.11.40 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని వివరించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తిలను దృష్టిలో పెట్టుకుని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన మేరకు పనులను చేపట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీల వారీగా రూ.60 లక్షలతో పలు పనులను ఉపాధిహామీ పథకం కింద చేపట్టనున్నట్లు తెలిపారు. ఆ క్రమంలో శానిటేషన్, డ్రైనేజ్ వ్యవస్థ, సిసి రోడ్ల నిర్మాణం, జగనన్న లే అవుట్ లలో అభివద్ధి పనులు, జగనన్నకు చెబుదాం కింద ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఆయా పనులు పూర్తి చెయ్యనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సంబంధిత శాఖల ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక మేరకు పనులకు చెందిన ప్రతిపాదన చేసినట్లు తెలిపారు.

కార్టూ'నిజం'


మీ నాయకుడి మీద సిబిఐ కేసులే ఉన్నాయ్.. అదే మా నాయకుడు మీదైతే సిఐడి, ఎసిబి, ఇడి కేసులన్నాయ్.. మా నాయకుడే గొప్ప..!!

ప్రజాభిమానమే వైసిపికి అండ : ఎంపి


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎంపి భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నాలుగేళ్ల జగన్ పాలనకు ప్రజలు చూపిస్తున్న అభిమానమే తమ పార్టీకి శ్రీరామ రక్ష అని ఎంపి భరత్ రామ్ అన్నారు. స్థానిక 37వ వార్డు కోరుకొండ రోడ్డు వీరభద్రపురం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద చిట్టి వెంపల తన మిత్రబందంతో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సభలో ఎంపి భరత్ మాట్లాడుతూ ప్రజలు తమంతట తాము వైసిపిలో చేరడం అంటే.సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనకు నూరు శాతం మార్కులు వేసినట్లేనన్నారు. గతంలో ఎప్పుడూ ఏ ప్రభుత్వం అందివ్వని సంక్షేమ పాలన జగన్ నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం అందిస్తోందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివద్ధి రెండు కళ్ళుగా చేసుకుని ప్రజారంజక పాలన అందిస్తున్నారని చెప్పారు. యువతకు నైపుణ్యాభివద్ధిపై శిక్షణ ఇస్తామని నమ్మించి, ఆ ప్రాజెక్టు ముసుగులో రూ.371 కోట్లు ప్రజా ధనాన్ని కొల్లగొట్టడం వల్లే చంద్రబాబును అరెస్టు చేశారని అన్నారు. చంద్రబాబు నక్కజిత్తుల డ్రామాలను ఇంకా నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ వైసిపి కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైసిపి నేతలు పాలిక శ్రీను, అజ్జరపు వాసు, మార్తి లక్ష్మి, మజ్జి అప్పారావు పీతా రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణం కోసమంటూ అప్పులు

- గృహాన్ని అమ్మకం పెట్టి ఉడాయించిన తల్లీ కూతుళ్లు

ప్రజాశక్తి - పెరవలి

అధిక వడ్డీ ఆశ చూపిన ఓ కుటుంబం చుట్టుపక్కల వారి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు అప్పు చేసి ఇంటి నిర్మాణం చేసిన అనంతరం ఆ ఇంటిని అమ్మకం చేసుకుని ఉడాయించిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. మండలంలోని ముక్కామల గ్రామంలో గణేష్ కాలనీకి చెందిన జుజ్జూరి విజయ చిన్నపాటి బడ్డీ కొట్టు నిర్వహిస్తోంది. ఆమె తల్లి పేకేటి నారమ్మ గ్రామంలోని దూదు ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. ఇద్దరు ఎంతో నమ్మకంతో చుట్టుపక్కల వారితో ఉన్నారు. కొత్తగా గృహాన్ని నిర్మించుకుంటున్నామని తన బడ్డి కొట్టు చుట్టు పక్కల వారిలో ఒకరికి తెలియకుండా ఒకరి నుంచి అధిక వడ్డి ఆశ చూపి విజయ అప్పులు తీసుకుంది. తల్లి నారమ్మ దూదు ఫ్యాక్టరీలో పనిచేసే పలువురు కార్మికుల నుంచి అప్పులు చేసింది. ఇరువురు ఇంటి నిర్మాణం పేరుతో తీసుకున్న అప్పు ద్వారా వచ్చిన నగదుతో ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. కొత్తగా నిర్మించిన గృహంలో ఏడాది పాటు ఉన్న ఆ తల్లీకూతుళ్లు గత రెండు నెలల క్రితం ఆ ఇంటిని మరోకరికి గుట్టుచప్పుడు కాకుండా అమ్మకం చేసేసి గ్రామాన్ని వదిలివెళ్లిపోయారు. గ్రామాన్ని వదిలిపోయారనే విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు నేడు లబోదిబోమంటున్నారు. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి చల్లపల్లి మోహన్ రావు నుంచి రూ.50,000, ఏడిద లక్ష్మి నుంచి రూ.1,00,000, మట్టా రాంబాబు నుంచి రూ.2,50,000, బొక్క వెంకాయమ్మ నుంచి రూ.2,50,000, పారిశుద్ధ్య కార్మికుడు ఇంటి దుర్గారావు నుంచి రూ.50,000 అధిక వడ్డీ ఆశతో జుజ్జూరి విజయకు అప్పు ఇచ్చారు. ఈ జాబితాలో అనేక మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఇంటి నిర్మాణం పేరుతో సుమారు రూ.15,00,000లకు పైగానే తల్లీకూతుళ్లు అప్పు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ తల్లీ కూతుళ్లు ఊరి వదిలి వెళ్లిపోయారనే సమాచారం తెలుసుకున్న అనేక మంది బయటకు వస్తున్నారు. అధిక వడ్డీ పేరుతో తమను నిమ్మించి ఊరు వదిలిపోయిన ఆ తల్లీకూతుళ్లను గుర్తించడంతోపాటు, వారి నుంచి తమకు రావాల్సిన అప్పును తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను బాధితులు ఆశ్రయించారు.


అప్పులు చేసి ఉడాయించిన విజయ

వైసిపిలో చేరిన వంగూరి


పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎంఎల్ఎ జక్కంపూడి

ప్రజాశక్తి - సీతానగరం.

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసిపి నాయకులు కొండపల్లి దుర్గారావు, బుడంపర్తి రాము ఆధ్వర్యంలో ఆదివారం రఘుదేవపురం గ్రామానికి చెందిన బిసి నాయకులు వంగూరి వెంకటరాజు అనుచరులతో కలసి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి తెలుగుదేశం పార్టీ కోసం బిసి నాయకులు వంగూరి వెంకట రాజు పని చేయడం జరిగిందని, ప్రభుత్వ పనితీరుతో పార్టీలో చేరికలు పెరిగాయన్నారు. బిసి నాయకులైన వంగూరి వెంకట రాజు సేవలను రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైసిపి తప్పక వినియోగించుకుంటుందని అన్నారు.

ఘనంగా బ్రాహ్మణ సమాఖ్య ఉత్సవాలు


ప్రశంసా పత్రాలను అందిస్తున్న బ్రాహ్మణ సమాఖ్య నాయకులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య 40 ఏళ్ళ ఉత్సవాలను సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని తాడిపర్రులో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు గ్రామానికి చెందిన బ్రాహ్మణ ప్రముఖులు పి.సత్య సూర్య ప్రసాద్, పి.హేమచంద్ర శేఖర్, పి.శ్రీనివాసు, ఎం. సుబ్బారావు లకు సన్మానం చేసి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని, సంఘ అభివద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వెంకట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డాక్టర్ చంటియ్యకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - కడియం


సత్యదేవ నర్సరీ అధినేత చంటియ్యను సత్కరిస్తున్న నర్సరీ రైతులు

చెన్నైలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ అందించిన గౌరవ డాక్టరేట్, భారత కళారత్న అవార్డులు అందుకున్న శ్రీ సత్యదేవ నర్సరీ అధినేత, కడియం నర్సరీ మేన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పుల్లా చంటియ్యకు అభినందనలు వెల్లువెత్తాయి. ప్రతిష్టాత్మకమైన అవార్డులను అందుకున్న ఆయన ఆదివారం ఉదయం చెన్నై నుంచి కడియపులంక చేరుకున్నారు. శ్రీ వీర హనుమాన్ నర్సరీ అధినేత మార్గాని సత్యనారాయణ, కడియం నర్సరీ మేన్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు తదితరులు చంటియ్యకు శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువాలతో సత్కరించారు. నిజాయితీ గలిగిన నర్సరీ రైతుగా, నిత్య కషీవలునిగా చంటియ్య ఎంతో పేరు ప్రఖ్యాతలు గడించారని, అటువంటి గొప్ప వ్యక్తికి అవార్డులు రావడం అభినందనీయమన్నారు. నర్సరీ రంగానికి ఇదొక గొప్ప గౌరవమని సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు.

గోతులు పూడ్చండి.. ప్రమాదాలను నివారించండి..


గోతులతో దర్శనం ఇస్తున్న ఆర్ అండ్ బి రోడ్డు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామపంచాయతీ పరిధిలో నిడదవోలు నుంచి పంగిడి వైపు వెళ్లి ఆర్ అండ్ బి రోడ్డు గోతులు పడడంతో వర్షం వచ్చినప్పుడు వర్షపు నీరు నిలబడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. కావున సంబంధిత అధికారులు వెంటనే ప్రమాదాల జరగకుండ్నా గోతులు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

అదనపు ఆదాయాన్నిచ్చేలా చెట్లు నాటుతాం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చేందుకు చెరువు చుట్టూ కొబ్బరి చెట్లు నాటేలా చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ బొక్కా శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పాలంగి గ్రామాన్ని సుందరీకరణ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఆహ్లాదనిచ్చేలా పంచాయతీకి ఆనుకుని ఉన్న చెరువు నలువైపులా పువ్వుల మొక్కలు, పంచాయితీకి ఆదాయాన్ని సమకూర్చేందుకు కొబ్బరి చెట్లు, నేరేడు చెట్లు నాటుతున్నట్లు చెప్పారు. గ్రామంలో ప్రజలు తమ నివాస స్థలాలలో మొక్కలు తప్పనిసరిగా నాటితే భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించొచ్చునని అన్నారు.


సూచనలు చేస్తున్న సర్పంచ్

అధికారుల తీరు మారకపోతే రాజీనామా


ఎంపిటిసి సుబ్బారావు

ప్రజాశక్తి - పెరవలి

వృద్ధాప్య పింఛన్ల మంజూరులో అధికారుల తీరు మారకపోతే తన పదవికి రాజీనామా చేస్తానని ఎంపిటిసి హరిదాసు సుబ్బారావు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదలచ చేశారు. మండలంలో కానూరు అగ్రహారం గ్రామంలో 9 నెలలు క్రితం వృద్ధాప్య పింఛన్ల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆయా దరఖాస్తుల పరిపరిశీలించి 10 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేయగా వారిలో ఆరుగురికి మాత్రమే గ్రామ వాలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారని చెప్పారు. మిగిలిన నలుగురికి పింఛన్లు మంజూరు అయ్యినా సెంక్షన్ అయిన పింఛన్ సొమ్ములు వారికి ఇవ్వకుండా విచారణ నెపంతో వృద్ధులను వేధించడం చాలా బాధాకరం విషయాన్ని మండల ఎంపిడివో దృష్టికి పలుమార్లు తీసుకెళ్ళిన పట్టించుకోకపోవడం కొవ్వూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి, తహాశీల్దార్ కార్యాలయానికి, గత సోమవారం వద్దులు స్పందనకు వెళ్ళి అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించలేదన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లను తక్షణమే ఇవ్వాలని లేనిపక్షంలో తన పదవికి రాజీనామా చేస్తానని హెచ్చరించారు.

ఎన్నాళ్లీ వెట్టిచాకిరి...?

- సమస్యలలో మధ్యాహ్న భోజన కార్మికులు
- ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు
- పెరిగిన ధరలకు అనుగుణంగా పెరగని బడ్జెట్
- ఆందోళనలో మిడ్ డే మీల్స్ కార్మికులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతి పిల్లలకు మధ్యాహ్న భోజనం వండి పెట్టి ఆకలితీర్చే మధ్యాహ్న భోజన కార్మికులు అర్థాకలితో కాలం వెళ్లదీస్తున్నారు. పాఠశాలల సెలవులు మినహా నెలంతా వండి పెట్టినా వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 3000 మించి ఇవ్వడం లేదు. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో జిల్లావ్యాప్తంగా సుమారు 350 మంది మధ్యాహ్న భోజన కార్మికులు వండి వడ్డిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి వండి పెట్టడానికి అవసరమైన నూనె, పోపు గింజలు, పప్పు, ఉప్పు, చింతపండు, కూరగాయలు, వంట చెరుకు తదితర సామగ్రి కోసం రూ.4.97 పైసలు, హైస్కూల్ విద్యార్థులకు రూ. 7.45 పైసలు ప్రభుత్వం చెల్లిస్తోంది. కనీసం ప్రాథమిక పాఠశాలలో రూ10, హైస్కూల్ విద్యార్థులకు రూ 20 చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు 100 గ్రాములు, హైస్కూల్ విద్యార్థులకు 150 గ్రాముల చొప్పున బియ్యం సరఫరా చేస్తారు. వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో మూడు రోజులపాటు కోడిగుడ్డు కూడా ఉడికించి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా ఒక్కో విద్యార్థి కోసం ఇచ్చే డబ్బు మాత్రం పెంచడం లేదు. కట్టెల పొయ్యి వాడొద్దని చెబుతూనే ప్రత్యామ్నాయంగా సబ్సిడీపై వంటగ్యాస్ అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది.

ఇబ్బందులకు గురి చేస్తున్న ఎస్ఎంసి కమిటీలు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగనన్న గోరుముద్ద పేరుతో మెనూ మార్పులు చేసింది. ఆ మార్పులు తగినట్లుగా బిల్లులు పెంచలేదు. మరోవైపు ఎస్ఎంసి కమిటీలను నియమించింది. ఈ కమిటీల్లో రాజకీయ జోక్యం పెరగడంతో మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపులు, పని ప్రదేశాల్లో ఇబ్బందులకు గురి చేయడం సర్వసాధారణంగా మారాయి. నాణ్యత తగ్గినా, కూరలు, పప్పులు సరిపోయినంత ఇవ్వకున్నా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తున్నది. ప్రాథమిక స్థాయి పిల్లలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం వంద గ్రాముల బియ్యం ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల పిల్లలు అల్పాహారం తీసుకునే అలవాటు లేకపోవడం అందుకు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడుతున్నారు. అలాంటి విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న 100, 150 గ్రాముల బియ్యం సరిపోకపోవడం, అదనంగా ఎస్ఎంసి సభ్యులు అదనంగా తీసుకునే ఫలితంగా కొన్నిచోట్ల భోజనం సరిపోవడం లేదు. ప్రభుత్వమే విద్యార్థులకు అవసరమైన బియ్యం సరఫరా చేస్తున్నా హమాలీ ఛార్జీలు మధ్యాహ్న భోజన కార్మికులే భరించుకోవాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఇచ్చే మెస్ బిల్లుతో నాణ్యమైన భోజనం పెట్టలేని పరిస్థితులలో రాజీ పడలేక ఇంటి నుంచి అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోతున్నారు.


విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

రాగిజావకు ప్రత్యేక కేటాయింపులేవీ?

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీ చేయాలని ఆదేశించిన విషయం విధితమే. అయితే వీటి కోసం ప్రత్యేకంగా చెల్లింపులు ప్రకటించలేదు, వంట పాత్రలు సైతం అందించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు మెస్ బిల్లులు వేతనాలు ఇప్పటికీ పెండింగ్లో ఉంటున్నాయి. మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేయాలని, మెస్ ఛార్జీలు కాకుండా వంట సరుకులు కూడా సరఫరా చేయాలని కొన్నేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదు. కట్టెల పొయ్యిపైనే వంట చేయడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల్లో చాలామంది అస్తమా, ఎలర్జీలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. మూడు, నాలుగు నెలలకు కూడా బిల్లులు రాని పరిస్థితుల్లో మధ్యాహ్న భోజన కార్మికులు ఇంటి నుంచి పెట్టుబడి పెట్టి వండి వడ్డించాల్సి వసుంది. గౌరవ వేతనం మండల విద్యాధికారి ఖాతాలో జమవుతాయి. మండల విద్యాధికారి జిల్లా అధికారులకు బిల్లును పంపగా అక్కడ నుంచి రాష్ట్ర ఫైనాన్స్ విభాగానికి వెళ్తాయి. నిధుల లభ్యతను బట్టి ఫైనాన్స్ క్లియరెన్స్ అందితే వీరికి మూడు, నాలుగు నెలలకొకసారి డబ్బు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ వేతనాన్ని పెంచడంతోపాటుగా సరుకుల ఛార్జీలను పెంచాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్నారు.

నెలకు రూ.12వేల వేతనం ఇవ్వాలి

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 12000 ఇవ్వాలి. గత 20 సంవత్సరాలుగా పాఠశాలల విద్యార్థులకు ఈ పథకం ద్వారా మధ్యాహ్న భోజన కార్మికులు భోజనం వండి పెడుతున్నారు. ప్రభుత్వం చెల్లించే ధరలకు మార్కెట్లో సరుకులు రావడం లేదు. కట్టెల పొయ్యి వాడకం ఫలితంగా చాలామంది అనారోగ్యాల పాలవుతున్నారు. నిత్యావసర సరుకులు, గ్యాస్ ప్రభుత్వం పంపిణీ చేయాలి. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ 10, హైస్కూల్ విద్యార్థులకు రూ 20 చొప్పున చెల్లించాలి.

-సిహెచ్ బేబీ, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు

నేరాలు ఘోరాలు


పిడిఎఫ్ బియ్యం స్వాధీనంచేసుకున్న విజిలెన్స్ అధికారులు

పిడిఎఫ్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలో ఆదివారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నిలవ చేసిన 5 టన్నుల పిడిఎఫ్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు .గ్రామంలోని గంటా సాయిబాబు ఇంటిలో 96 ప్లాస్టిక్ బస్తాల్లో నిలువ చేసిన బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎంఎస్ఒ విజయకుమారి తెలిపారు. ఈ బియ్యం విలువ రూ.2 లక్షలు ఉంటుందన్నారు. ఈ బస్తాలను సీజ్ చేసి 6ఎ కింద కేసు నమోదు చేసినట్లు ఎంఎస్ఓ విజయకుమారి తెలిపారు.ఈ దాడుల్లో విజిలెన్స్ సిఐ ఎన్.రమేష్, విఆర్ఒ వెంకటేశ్వరరావు, జివిఎస్ లోవకుమార్ తదితరులు పాల్గొన్నారు.


సారాను స్వాధీనం చేసుకున్న దృశ్యం

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని తిరుమలాయపాలెం గ్రామంలో సారా బట్టీపై ఎస్ఇబి పోలీసులు దాడి చేసి వ్యక్తిని అరెస్టు చేశారు. గ్రామానికి చెందిన గండిబోయిన వీర మహేంద్ర అటవీ ప్రాంతంలో సారా బట్టీలు నిర్వహిస్తున్నాడని అందిన సమాచారం మేరకు ఎస్ఈబి పోలీసులు సారాబట్టీపై దాడి చేశారు. ఈ సందర్భంగా 33 లీటర్ల సారా, ఒక మోటర్ బైక్ ను స్వాధీనం చేసుకుని, 600 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. గండిబోయిన వీర మహేంద్రను అరెస్టు చేసి రిమాండ్ పంపించడం జరిగిందని తెలిపారు.


బాధితకుటుంబానికి సాయం అందజేస్తున్న ఎంఎల్ఎ

పిడుగుపాటుకు పెంకుటిల్లు ధ్వంసం

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలం రామన్నపాలెం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పిడుగు పాటుకు జొన్నకూటి సుబ్బారావు పెంకుటిల్లు పూర్తిగా ధ్వంసం అయింది. పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. సుమారుగా రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఇంటి యజమాని వాపోయాడు. ఈ విషయం తెలుసుకున్న గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ఘటన స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. బాధితులకి రూ.5,000 ఆర్థిక సహాయం, 20 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేసి ప్రభుత్వం తరపున సాయం తొందరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుల్లారావు, డిప్యూటి తహశీల్దార్, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-గోపాలపురం

గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చిట్యాల గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గంగుల ఆంజనేయులు(30) శనివారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం వెళ్లి పనులు ముగించుకొని తిరిగి ఇంటికి తిరిగి వస్తున్నాడు. అదే రోజు రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో మండలంలోని చిట్యాల గ్రామ శివారు గల మాతంగి అమ్మ వారి గుడి సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న అతనినిఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొని వెళ్లిపోయింది. మృతునికి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మతిచెందాడాని తెలిపారు. మృతుని తండ్రి గంగుల వెంకట రెడ్డి ఫిర్యాదు మేరకు గోపాలపురం పోలీసు స్టేషన్ నందు యాక్సిడెంట్ కేసుగా నమోదు చేసి గోపాలపురం ఎస్.ఐ కె.సతీష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం హుస్సేన్ పురం గోదావరి కాలవలో ఎస్‌సి కాలనీ వద్ద ఆదివారం సుమారు 25 ఏళ్లలోపు వయసుగల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికుల ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. మతుని వివరాలు తెలిసినవారు సామర్లకోట సిఐ సెల్ నెం.9440796568, ఎస్ఐ సెల్ నెం. 9701626505 సమాచార ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

యానాం వార్తలు

ఎంబిబిఎస్ సీట్ల వివరాల విడుదల

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యాప్తంగా మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ సీట్ల కేటాయింపునకు సంబంధించిన వివరాలను హెల్త్ సెక్రటేరియట్ అధికారులు విడుదల చేశారు. ఇందిరా గాంధీ ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో మొత్తం 180 సీట్లకు గాను ప్రభుత్వ కోటాకు 131 ఆల్ ఇండియా కోటా 27, ఎన్ఆర్ఐ కోటా 22 సీట్లు కేటాయించారు. మహాత్మాగాంధీ మెడికల్ కళాశాల్లో బిడిఎస్‌లో యానాం-1, పుదుచ్చేరి-31, కారైకల్-8, మాహే-2 సీట్లు లభిస్తున్నాయి.రాజీవ్ గాంధీ కళాశాలలో యానాం-1,కారైకల్-8,పుదుచ్చేరి-33, మాహే-2 సీట్లు లభిస్తున్నాయి.

అంబులెన్స్ డ్రైవర్ల డిమాండ్లకు సిఎం అంగీకారం

ప్రజాశక్తి - యానాం

యానాంలో 108 అంబులెన్స్ డ్రైవర్ల డిమాండ్లకు పుదుచ్చేరి ప్రభుత్వం అంగీకారం తెలపడంతో డ్రైవర్లు నిరసన విరమించారు. రోజువారీ రూ.895 ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని సిఎం రంగసామి అంగీకరించడం తో నిరసను విరమిస్తున్నామని ఆదివారం డ్రైవర్ల సంఘ యూనియన్ నేతలు బి. ముసలయ్య, బొడ్డు ప్రసాద్, సీహెచ్ సుబ్బారావు, బేతాళం సతీష్, రామలింగం తదితరులు తెలిపారు.


ఏడిద రోడ్డులో నిరుపయోగంగా ఉన్న టాయిలెట్

నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్స్

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డు పెద్ద వంతెన, కృష్ణ టాకీస్ ఎదురుగా, ఏడిద రోడ్డులోని ఆటో స్టాండ్ సమీపంలో నిర్మించిన పబ్లిక్ టాయి లెట్స్ నిరుపయోగంగా మారాయి. పట్టణ పరిశుభ్రతలో భాగంగా గత ప్రభుత్వంలో వీటిని నిర్మించి నప్పటికీ ప్రస్తుతం ఇవి వినియోగం లేకపోవడంతో పాడైపోతున్నాయి. వీటిని వినియోగంలో తీసుకు రావడంతో పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రయాణికులకు ఇవి ఉపయోగపడతాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

యర్రపోతవరం వంతెన వద్ద ఆక్రమణల పర్వం

పట్టించుకోని ఆర్ అండ్ బి శాఖ

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ -యానం మెయిన్ రోడ్ లోని ఎర్ర పోతవరం వంతెన వద్ద ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే ఈ వంతెన వద్ద పలు ఆక్రమణలతో రెండు వైపులా రోడ్డును ఆక్రమించి పలు షాపులు వెలిశాయి. ఇది చాలదన్నట్టు ఇటీవల మరిన్ని ఆక్రమణలు కొనసాగుతున్నాయి చాలా మంది ఆక్రమణతోర్లు శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. ఈ ఆక్రమణల వల్ల వంతెనపై నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఇక సాయంకాలం సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత దారుణంగా ఉంటుంది. రోడ్డుపై బహిరంగంగా ఆక్రమణలు జరుగుతున్న రహదారి భవనాల శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో రోజురోజుకీ ఆక్రమణలు మరింత పెరుగుతున్నాయి. ఒకవైపు ఆక్రమణలు జరుగుతున్న వైపు ఆక్రమణలు జరుగుతున్న వాళ్ల పట్టించుకున్న దాఖలాలు లేవు దీంతో మెయిన్ రోడ్డు కాలువకు ఆనుకుని అనేక బడ్డీలు వెలుస్తున్నాయి. ఆక్రమణం తొలగించి రోడ్డు విశాలం చేయాలని నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు


ఎర్ర పోతవరం వంతెనవద్ద పెరిగిపోతున్న అక్రమ కట్టడాలు

ప్రమాదకరంగా రహదారి వంతెన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని వాకతిప్ప గ్రామ శివారులో పంట కాలువ పై ఉన్న రహదారి వంతెన ప్రమాదకరంగా మారింది. ఎస్ ఆకారంలో ఉన్న ఈ రహదారి మలుపులో వంతెన ఎడమవైపు రక్షణ గోడ కొంత భాగం కూలింది. రహదారి పక్కన ఏర్పడిన గుంతలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు, రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ వంతెన మలుపు తిరిగే క్రమంలో ఆదమరచి పక్కకు వెళితే లోతైన పంట కాలువలోకి వాహనచోదకులు పడిపోయే ప్రమాదం ఉంది. ఈ వంతెన మలుపు తిరిగే సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందో తెలియని పరిస్థితి . ఈ వంతెన రహదారిమలుపు మీదుగా వాకతిప్ప నుంచి నాగుల చెరువు కు వెళ్లే గ్రామాలతో పాటు కోరుమిల్లి, మాచర, శ్రీరాంపురం, గ్రామాల ప్రజలు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ మలుపులో ఉన్న వంతెన రక్షణ గోడ పటిష్టంగా నిర్మించాలని, రహదారి మలుపులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రామస్తులతో పాటు ప్రయాణికులు, వాహనదారులు, రైతులు, కోరుతున్నారు .


రక్షణ గోడ విరిగి ప్రమాదభరితంగా ఉన్న రహదారి మలుపు

పలువురికి ఉచిత కంటి వైద్య పరీక్షలు


కంటి వైద్య పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

కోరుమిల్లిలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సందర్భంగా గ్రామానికి చెందిన కంఠం శెట్టి సత్యం, సత్యవతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కంఠం శెట్టి ఆది నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచి త కంటి వైద్య శిబిరం లో మండపేట జయరామ్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు కంఠం శెట్టి ప్రతాప్ చౌదరి పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కేట్రాక్ట్ అవసరం ఉన్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వైద్య శిబిరంలో కాకినాడ చెందిన కంటి వైద్యరాలు డాక్టర్ అరుణ, వాసంశెట్టి విజయ కుమార్, తొగరు జానకి రామయ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సుబ్రహ్మణ్యానికిసాయంఅందజేస్తున్నమానవతా శాఖ సభ్యులు

'మానవత' శాఖ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

పక్షవాతంతో బాధపడుతూ జీవనోపాధికి ఇబ్బంది పడుతున్న తాళ్లపూడికి చెందిన చల్లా సుబ్రహ్మణ్యంకు మండల మానవతా శాఖ ఆదివారం రూ.5వేల ఆర్థికసాయం అందజేసింది. మానవతా సభ్యులు సిహెచ్.బంగారుబాబు మరో రూ.వెయ్యి సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా శాఖ అధ్యక్షులు ఎస్. సుబ్బారావు, కార్యదర్శి టి.దోసాలు, కోశాధికారి ఎ.హనుమంతరావు, రీజనల్ ఛైర్మన్ వి .చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - గోకవరం

మండల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందని ప్రజలు ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది కలిసి బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని ఎస్ఐ శివ నాగబాబు ఆదివారం తెలిపారు. మండలంలో ఎక్కడ చట్ట వ్యతిరేక పనులను చేయరాదని, ప్రజలకు ఎటువంటి ఆటంకాలు ఉండరాదని తెలిపారు. మండల ప్రజలు దీనిపై నిబద్ధత కలిగి ఉండాలని తెలిపారు.

పట్టణంలో కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం పట్టణంలో ఏ వార్డు పరిధిలో ఏ వీధికి వెళ్ళినా కుక్కలబెడద తప్పటంలేదు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా రోడ్లపై సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రాత్రి ఈ సమయంలో అనేకమంది ఈ కుక్కల దాడిలో గాయపడుతున్నారు. ప్రతి రోజూ కుక్క కాటుల వల్ల ప్రభుత్వాస్పత్రికి వస్తున్న బాధితులు సంఖ్య పెరుగుతుందని ఆస్పత్రుల గణాంకాలు చెబుతున్నాయి. మున్సిపల్ అధికారులు పాలక వర్గం వీటిపై శ్రద్ధ చూపాలనే పట్టణ వాసులు కోరుతున్నారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా వీటి విషయంలో జోక్యం చేసుకోలేకపోతున్నామని అధికారులు అంటున్నారు. అయితే వీటిని పట్టుకొని సుదూర ప్రాంతాల్లో వదిలి పెట్టాలని బాధ్యత అధికారులకు లేదా అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. వాటి సంఖ్య పెరగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.


గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

విద్యాలక్ష్మి గణపతి ఉత్సవాలకు రాట ప్రతిష్ట

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంక ముసలమ్మ అమ్మవారి ఆలయంలో కొలువైయున్న విద్యాలక్ష్మి గణపతి వారి గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వాహణ కోసం ం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాటముహూర్తం నిర్వహించారు. సహస్ర నామ పారాయణ, పంచామత అభిషేకం, గోక్షీర నవధాన్యాలతో భూమాత పూజ నిర్వహించి రాట ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి ఛైర్మన్ పెద్దిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 18 నుంచి 26 వరకు గణపతి సహస్ర నామంతో నవరాత్రి వ్రతం జరుగుతుందని తెలిపారు.

గోశాలకు ఆవు అందజేత

ప్రజాశక్తి - కడియం

కడియంలో మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోశాలకు రోజురోజుకు భక్తులు పోటెత్తుతున్నారు. పలువురు దాతలు గోవులకు, పశు గ్రాసాన్ని విరివిగా అందిస్తున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన బిజెపి మండల శాఖ ఉపాధ్యక్షులు గారపాటి తాతబ్బాయి, సత్యవేణి దంపతులు రూ.30వేల విలువచేసే గిరి ఆవును ఆలయ ప్రధాన అర్చకులు అప్పలి శ్రీమన్నారాయణ, గోసాల కమిటీ సభ్యులు పిండి నాగరాజులకు అందించారు. 6 నెలలపాటు తన కుటుంబ సభ్యులకు గల 50 సెంట్లు వ్యవసాయ భూమిలో గడ్డినిగోశాలకు అందించనున్నట్లు తాతబ్బాయి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

టిడిపి అధినేత నారా చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక ఒక వ్యక్తికి గుండెపోటు వచ్చింది. అతనిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. వివరాలు ఇవి.. చంద్రబాబు అరెస్టును చేయడంతో ఆ విషయాన్ని తట్టుకోలేక మండలంలోని నల్లూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త జొన్నకూటి రాజు(51)కు గుండెపోటు వచ్చింది. దీంతో అతనిని కాకినాడ గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన చికిత్స పొందుతూ శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఏ వేగుళ్ళ జోగేశ్వరరావు ఫోన్ లో మాట్లాడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రాజు మృతికి ఎంఎల్ఏ వేగుళ్ల సంతాపం తెలిపారు. టిడిపి శ్రేణులు మతిని కుటుంబ సభ్యులను పరామర్శించారు.